ఉదయ్ స్కీంకు సాగు మీటర్లకు లింకెట్ల?

- సభను సీఎం తప్పుదోవ పట్టించారు
- 2017 నాటి ఉదయ్ స్కీమ్‌తో 2021 నాటి విద్యుత్తు మీటర్ల ఏర్పాటు అంశం కలిపారు
- బోడిగుండుకు మోకాలుకు లింక్ పెట్టారు
- వివరణ ఇవ్వనీయకుండా సభ వాయిదానా?
- రైతుల కోసం 30 వేల కోట్లు వదులుకున్నం
- మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, కౌశిక్‌రెడ్డి, బీ లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): మందబలం ఉన్నదని సభను సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన తమకు మైక్ కూడా ఇవ్వకుండా, క్లారిఫికేషన్ తీసుకోకుండా సభను వాయిదా వేసుకొని పారిపోవటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు స్మార్ట్‌మీటర్ల అంశంలో ప్రజలను సీఎం తప్పుదోవ పట్టించి తమను వివరణ ఇవ్వనీయలేదని ఫైరయ్యారు. బోడిగుండుకు, మోకాలుకు లింక్ పెట్టి ప్రజలకు అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. శనివారం రాత్రి సభ వాయిదా అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వం ఉదయ్ పథకాన్ని రాష్ట్రం మీద బలవంతంగా రుద్దింది. మీటర్లు పెడుతున్నట్టు సంతకాలు పెట్టినం అని చెప్పుండగానే మైక్ కట్ చేశారు. ఉదయ్ పథకంలో 27 రాష్ట్రాలు చేరాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్ వంటి రాష్ట్రాలు కూడా చేరాయి. ఇందులో ఏముందంటే వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మినహాయించి 500పైగా యూనిట్ల విద్యుత్తు వాడే పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఉన్నది. మేము కూడా ఈ పథకంలో చేరాము. కానీ, ఎక్కడా ఇప్పటివరకు స్మార్ట్ మీటర్లు పెట్టలేదు. ఇక, నేను చెప్తున్న నోట్.. 2021 జూన్ 9 నాటిది. ఇందులో ఏముందంటే ఏ రాష్ట్రాలైతే ఎఆర్‌బీఎం పరిధిలో 0.5 శాతం అప్పు తీసుకోవాలనుకుంటున్నాయో మీ ప్రతిపాదనలు పంపండి అని కేంద్రం కోరింది. వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించి ఉంటే రాష్ట్రానికి రూ.30 వేల కోట్లు వచ్చేవి. కానీ, రైతుల ప్రయోజనాల కోసం మేం అందుకు ఒప్పుకోలేదు. ఇదే మేం చెప్పినం. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం ఉదయ్ స్కీమ్‌తో ఎఫ్ఆర్‌బీఎం రుణ వ్యవహారానికి లింకు పెట్టి సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మీటర్లు పెడుతున్నట్టు సంతకాలు పెట్టిందని, అధికారులు పెట్టారని సీఎం మసిబూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారు. నేను చెప్పింది ఒకటి సీఎం మాట్లాడింది మరొకటి. మందబలం ఉన్నదని సభను, ప్రజలను సీఎం తప్పుదోవ పట్టిస్తున్నరు. బోడిగుండుకు మోకాలుకు లింక్ పెట్టారు. సభా నాయకుడు మా మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు సీఎం మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నారేమో అని అనుమానంగా ఉన్నది. ఇప్పటికీ మేము స్మార్ట్ మీటర్ కూడా పెట్టలేదు. రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యం' అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పదు

▸ మొదటిపేజీ తరువాయి...

విద్యుత్‌శాఖకు విధిలేని పరిస్థితి ఏర్పడింది. విధిలేని పరిస్థితుల్లోనే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పని పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది' అని స్పష్టం చేశారు. విద్యుత్ మీటర్లపై 2017 జనవరి 4న కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉదయ్ పథకంలో చేరుతూ గత ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదని తెలిపారు. ఇందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 2017 జూన్ 30లోపు, ఫీడర్ చానల్‌వద్ద, 500 యూనిట్లు వినియోగించే వినియోగదారుల వద్ద 2018 డిసెంబర్ 31 వరకు, 200 యూనిట్ల వినియోగదారుల వద్ద 2019లో స్మార్ట్‌మీటర్లు పెడతారని తాను చెప్పినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నాడు జరిగిన ఒప్పందం, పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వ్యవసాయ పంపుసెట్ల వద్ద వీళ్లు(బీఆర్ఎస్) మీటర్లు పెడతారని తాను మాట్లాడానా అని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 100శాతం మీటర్లు పెడితే.. వీటి కింద వ్యవసాయ కనెక్షన్లు ఉండవా అని ప్రశ్నించారు. వ్యవసాయానికి విద్యుత్ వెళ్లే డిస్ట్రిబ్యూషన్ దగ్గర పెడుతున్నారని, విడివిడిగా వ్యవసాయ వినియోగదారుల వద్ద మీటర్లు పెడతలేరని తెలిపారు. ఈ ఒప్పందాన్ని తాము వ్యతిరేకించామని, తిరగబడ్డమని, 30వేల కోట్లు వదులుకున్నామని బీఆర్ఎస్ గొప్పలు చెబుతున్నదని మండిపడ్డారు.

ప్రధాని పెద్దన్న

ముఖ్యమంత్రులకు ప్రధానమంత్రి పెద్దన్న లాంటి వారని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ అన్న మాటలకు ఆయన స్పందించారు. రాష్ట్రాల్లో అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ప్రధాని మోదీ గుజరాత్, యూపీ, బీహార్‌కు ఏ విధంగా నిధులు ఇస్తున్నారో తెలంగాణకు కూడా అదే స్థాయిలో నిధులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. పెద్దన్న మాదిరిగా రాష్ట్రాలపై వివక్ష చూపొద్దని కోరినట్టు చెప్పారు.

అక్బరుద్దీన్‌ని డిప్యూటీ సీఎం చేస్తా

అక్బరుద్దీన్ ఓవైసీని డిప్యూటీ సీఎం చేస్తానని సీఎం ప్రకటించారు. కొడంగల్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని షరతు విధించారు. నామినేషన్ పత్రంపై సంతకం చేస్తే గెలిపించుకొని వస్తానని హామీ ఇచ్చారు. దీనిపై స్పందించిన అక్బరుద్దీన్.. తాను జీవితాంతం ఎంఐఎంలోనే ఉంటానని స్పష్టం చేశారు. ఇక ఓల్డ్‌సిటీకి మెట్రో విస్తరణపై అక్బరుద్దీన్ అడిగిన మరో ప్రశ్నకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ... 'ఓల్డ్‌సిటీకీ మెట్రో విస్తరణ చేయాల్సిందే.. లేదంటే చర్లపల్లి, లేదా చంచల్‌గూడ జైలులో ఉండాల్సి వస్తుందని ఎల్‌అండ్‌టీ సంస్థకు స్పష్టం చేశాను.' అని తెలిపారు.

లోకం పోకడ



ఎవడ్రా.. వాళ్లకు ఈ పేరు పెట్టమని చెప్పింది? వాళ్లుకు పిండం పెట్టా!

రైతులకు సాగునీళ్లివ్వాలనే సోయి లేదు

- కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ నాటకాలు
- లక్షల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): వ్యవసాయంపై ఒక్క మంత్రికీ అవగాహనలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్రా బాసుల మోచేతి నీళ్లు తాగిన వీళ్లకు తెలంగాణ గురించి ఏం తెలుసని నిలదీశారు. బీఆర్ఎస్‌పై రాజకీయ ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఎస్ఏ హైదరాబాద్ రాకుండా ఢిల్లీ నుంచే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పినట్టు రిపోర్ట్ ఇచ్చిందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని, పంప్‌హౌజ్‌లు నడిపితే కేసీఆర్‌కు పేరు వస్తుందని లిఫ్టులను ప్రారంభించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం పంప్‌హౌజ్‌లు నడపక మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్ల లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ప్రాజెక్టుల ద్వారా నీరివ్వాలని, లేకుం టే రైతుల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు.

పెండింగ్‌లో పోలీస్ బిల్లులు : పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ జిల్లాలోని సుమారు వెయ్యి మంది పోలీసులకు సరెండర్, టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. తక్షణమే ఆ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నదని, ఈ రోజు వరకు ఉమ్మడి కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో మాడల్ స్కూల్ టీచర్లకు జీతాలు రాలేదని విమర్శించారు.

అసెంబ్లీలో పరిగి ఎమ్మెల్యే నవ్వులపాలు!

ప్రతిపక్షాలపై తొడగొట్టడంపై విమర్శల వెల్లువ.. బడ్జెట్ కాపీని తప్పుగా చదవడంతో నవ్వులపాలు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో కాంగ్రెస్‌కు చెందిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తొడగొట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏ క్షణమైనా పడిపోతుందంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతల నుంచి సవాళ్లు వస్తున్నాయని, మీరు ప్రభుత్వాన్ని పడగొడతాం.. అంటే మేము తొడగొడతాం' అని అంటూ రామ్మోహన్‌రెడ్డి తొడగొట్టి మరీ చూపించారు. దీంతో సభలో ప్రతిపక్షాల నుంచే కాకుండా వివిధ ప్రజాసంఘాల నేతలు సహా ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురైంది. అంతకు ముందు బడ్జెట్ కాపీని చదువుతూ అందులో పొందుపరచిన పదాలను సరిగా పలకలేకపోయారు. రుణాల మాఫీ బదులు రణాల మాఫీ అని, మురుగునీటి శుద్ధి బదులు మరుగు శుద్ధి అంటూ పలు తప్పులను పలకడంతో సభలో పలువురు నవ్వుకున్నారు.

వికారాబాద్‌ను రంగారెడ్డిలో కలుపుతారా?: ఎమ్మెల్యే సబిత

వికారాబాద్‌ను జిల్లాగా ఏర్పాటుచేయడం వల్ల తీవ్ర నష్టం జరిగిందన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొనడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఘాటుగా స్పందించారు. రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు వింటుంటే వికారాబాద్‌ను మళ్లీ రంగారెడ్డిలో కలిపేలా ఉన్నదని, అదే ప్రభుత్వ అభిప్రాయమా? దీనిపై ప్రభుత్వ వైఖరిని తేల్చాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలను ఏర్పాటు చేయాలని, జిల్లాల విభజనపై కమిటీ వేయాలని పరిగి ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం గమనార్హం.

రుణమాఫీకి అర్జీలెందుకు?: ఎమ్మెల్యే సునీతా

రుణమాఫీ కోసం మళ్లీ అర్జీలెందుకని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రసంగి స్తూ రుణమాఫీ రాని రైతులు మళ్లీ ఎమ్మెల్యేలను కలి సి అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. రుణమాఫీపై ప్రభుత్వం ఒక విధాన విధానాన్ని అమలులోకి తెచ్చాక కొందరి రుణాలు మాఫీ కావడం, మరికొందరివి కాకపోవడం ఏమిటని సునీత నిలదీశారు. మాఫీ కాని వారు మళ్లీ అర్జీలు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతులు వేలల్లో ఉన్నారని గుర్తుచేశారు. తన నియోజకవర్గంలోని పలు గ్రామాలను ఆమె ఉదహరించారు.

బడ్జెట్ లెక్కలే బీఆర్ఎస్ పాలనకు నిదర్శనం

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదనడం హాస్యాస్పదం

- శాసనమండలి సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ముగిసిన చర్చ

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కలే బీఆర్ఎస్ గత పాలనలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. శాసనమండలిలో శనివారం జరిగిన బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పాల్గొని మాట్లాడారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని వారు మండిపడ్డారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. అనంతరం బడ్జెట్‌పై చర్చను శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రారంభించారు. బడ్జెట్‌పై సభ్యుల చర్చ అనంతరం సభ్యుల అభ్యంతరాలపై డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క వివరణ ఇచ్చారు. అనంతరం మండలిని ఈనెల 31కి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వాయిదా వేశారు. చర్చల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, సత్యవతి రాథోడ్, సురభి వాణిదేవి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సురభి వాణిదేవి, ఎల్ రమణ, శేరి సుభాశ్‌రెడ్డి, తాతా మధు, మహమూద్ అలీ, నవీన్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు టీ జీవన్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, వెంకట్, బీజేపీ సభ్యులు ఏవీఎన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

గందరగోళంగా బడ్జెట్: దేశపతి శ్రీనివాస్

రాష్ట్ర బడ్జెట్ గందరగోళంగా ఉన్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాన్ని అధికార పక్షం తిట్టడమే బడ్జెట్ లక్ష్యంగా కనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఏడు నెలల్లోనే ఈ ప్రభుత్వం 35 వేల కోట్ల అప్పు చేశారని, ఈ ప్రభుత్వం కూడా ప్రతి నెల 5 వేల కోట్ల అప్పు తీసుకుంటున్నదని విమర్శించారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోలేని అప్పులు రూ.30 వేల కోట్లని, ఏడాది అప్పులే రూ.1 లక్ష కోట్ల అప్పుల అంచనా కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఉన్నదని వాటిని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

త్వరితగతిన రైతుభరోసా నిధులివ్వాలి : వాణీదేవి

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు త్వరితగతిన రైతు భరోసా నిధులను రైతులకు చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు ఇస్తామన్న రూ.15 వేలను సకాలంలో ఇవ్వాలని కోరారు. రుణమాఫీని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో సభకు తెలపాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు.

బడ్జెట్‌లో బీఆర్ఎస్‌ను తిట్టేందుకే ప్రాధాన్యం: తక్కెళ్లపల్లి

బడ్జెట్ ప్రసంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏం చేయాలనుకుంటున్నదో చెప్పి, ప్రజల మెప్పు పొందాల్సింది పోయి దూషించడం ఏమిటని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కాల్వలు తవ్వి, పైపులు కొనుగోలు చేశారని, ఇవన్నీ కాంట్రాక్టర్ల లబ్ధి కోసమేనని విమర్శించారు.

రాజీనామాకు జీవన్‌రెడ్డి సిద్ధమా?: తాతా మధు

మాజీ సీఎం కేసీఆర్ నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి విమర్శించడం సరికాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ధ్వజమెత్తారు. సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చిన నీటి నుంచి 70 వేల ఎకరాల్లో విస్తారంగా పంటలు పండించామని, వస్తే చూపిస్తామని చెప్పారు. సత్యదూర ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే రాజీనామా చేయాలని, తాను మాట్లాడింది తప్పయితే తానే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధికి చర్చకు వచ్చినా తాను సిద్ధమేనని చెప్పారు. విద్యుత్తు రంగాన్ని కేసీఆర్ ఎంతగానో అభివృద్ధి చేశారని కొనియాడారు.

'ఓటాన్' కంటే తక్కువ కేటాయింపులా?

- 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం
- కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి
- ఇప్పుడు మళ్లీ విధ్వంసం వైపునకు..
- సంక్షేమ పథకాలన్నింటికీ తిలోదకాలు
- మూసీ ప్రాజెక్టుకు నిధులేవి?
- మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఇచ్చిన హామీలకు, బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతనలేదని శాసనమండలిలో ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. గతం కంటే భిన్నంగా అద్భుత పాలన అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అప్పులు అంటూ గగ్గోలు పెడుతున్నదని మండిపడ్డారు. శనివారం మండలిలో 2024-25 బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం హామీలను అమలుచేస్తామని ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించారని, సంకల్పం, అవగాహన ఉంటే ఇంత కాలయాపన ఎందుకు అవుతుంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో తెలంగాణ ప్రాంతం ఎటువంటి అవమానానికి, అన్యాయానికి, విధ్వంసానికి గురైందో తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. తెలంగాణపై అక్కసును వెల్లగక్కితే కేసీఆర్ ఉద్యమాన్ని నిర్మించి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధించేనాటికి రాష్ట్రంలో సాగునీరు లేదు.. తాగునీరు లేదు.. కరెంటు లేదు.. మెరుగైన వైద్యం లేదు అని తెలిపారు. 'స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో తలసరి ఆదాయం, జీఎస్డీపీ పెరిగింది. మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఆదర్శ గ్రామాలు ఏర్పడ్డాయి. శాంతిభద్రతల నిర్వహణ అద్భుతం. పెట్టుబడులు తరలివచ్చాయి. నిరంతర విద్యుత్తు సరఫరా, ఇంటింటికీ తాగునీరు, పచ్చదనం పెంపు, వ్యవసాయంలో తెలంగాణ నంబర్ వన్ అయ్యింది. కేసీఆర్ చేసిన అభివృద్ధి చూస్తే మనసు ఉప్పొంగుతుంది. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. దేశానికి తెలంగాణ రోల్‌మాడల్‌గా నిలిచింది' అని వివరించారు.

బీఆర్ఎస్ ప్రతి పథకం ప్రజా సంక్షేమమే

'కల్యాణలక్ష్మి పథకం వెనుక ఒక నేపథ్యం ఉన్నది. వరంగల్ జిల్లా భాగ్యతండలో సంభవించిన ఘటన నేపథ్యం నుంచి వచ్చిందే ఈ పథకం. మొదట రూ.50 వేల నుంచి ప్రారంభమై.. రూ.లక్షకు పెరిగింది. వృద్ధులు, మహిళలు, బీడీ కార్మికులు, డయాలసిస్, ఒంటరి మహిళలకు రూ.200 ఉన్న పింఛను రూ.1,000కి, ఆ తర్వాత రూ.2 వేలకు పెరిగింది. ఈ ప్రభుత్వం రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. పేదలను ఆదుకోవాలని అనేక సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ అమలు చేశారు. ఇలాంటి పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. డైరెక్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఎకనామిక్స్ నివేదికే తెలంగాణ ప్రగతిని నిదర్శనం. అద్భుతాలు చేసి గత ప్రభుత్వాన్ని అభినందించకుండా, ఏమీ జరగనట్టు చిత్రీకరించటం మంచిది కాదు' అని కాంగ్రెస్ సర్కారుకు మధుసూదనాచారి చురక అంటించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఎకరానికి సంవత్సరానికి రూ.15 వేల పంట పెట్టుబడి ఇస్తామని, కౌలు రైతులకు రైతు భరోసా సాయం ఇవ్వడానికి మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని చెప్పినట్టు మధుసూదనాచారి గుర్తుచేశారు. మార్గదర్శకాలకే 4 నెలలు పడితే.. సాగదీస్తూ ఎగనామం పెడతారా? అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, మహిళలకు రూ.2,500, యువ వికాసం కింద రూ.5 లక్షల భరోసా కార్డు, చేయూత కార్డు, ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ అని నిలదీశారు.

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులెక్కడ?

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించటం మంచి నిర్ణయమని, దీనికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని మధుసూదనాచారి అన్నారు. అలాంటి ప్రాజెక్టుకు అంత తక్కువ కేటాయింపు ఏమిటని ప్రశ్నించారు. వైద్య రంగం, బీసీల సంక్షేమానికీ సరైన కేటాయింపులు లేవని వెల్లడించారు. 'యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని అన్నారు. వాటికి నిధుల కేటాయింపే లేదు. సింగరేణి కార్మికులు, సీనియర్ సిటిజన్స్, మాజీ సైనికులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, గల్ఫ్‌కార్మికులు, దివ్యాంగులు, క్రీడాకారులు, ట్రాన్స్‌జెండర్స్, పర్యాటక రంగం, జానపద సాంస్కృతిక రంగం, కార్మిక రంగాలకు ఎలాంటి కేటాయింపులు లేవని పేర్కొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి: సత్యవతి రాథోడ్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకప్పుడు నల్లాల దగ్గర మహిళ మధ్య గొడవవలు జరిగేవని, కేసీఆర్ తెచ్చిన మిషన్ భగీరథతో అవి బంద్ అయ్యాయని చెప్పారు. ఇప్పుడు మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో గొడవలు జరుగుతున్నాయని, దీంతో బస్సుల సంఖ్యను పెంచాలని, మారుమూల ప్రాంతాలకు కూడా నడుపాలని సత్యవతి రాథోడ్ కోరారు.

రాష్ట్రాన్ని మాడల్‌గా నిలిపిన కేసీఆర్: కోటిరెడ్డి

గత పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లోనూ దేశంలోనే ముందు వరుసలో నిలిచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి కొనియాడారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని, 24 గంటలు ఉచిత విద్యుత్తు అందించారని గుర్తు చేశారు. వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటన్నింటినీ విస్మరించి విమర్శించడం బాధాకరమని పేర్కొన్నారు.

మాది వాస్తవిక బడ్జెట్

భూమిలేని పేదలకు ఈ ఏడాది నుంచే రూ.12 వేలు

పేదలందరికీ ఇండ్లు కట్టిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవికమైనదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలతోపాటు వారి గుండె చప్పుడును అర్థం చేసుకుని అత్యంత ప్రగతిశీల భావాలతో పీపుల్స్ బడ్జెట్‌ను తెచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. తాము ప్రమాణ స్వీకారం చేయగానే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 హామీల అమలు ప్రక్రియను ప్రారంభించామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించే పథకానికి అదేరోజు శ్రీకారం చుట్టామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1నే జీతాలు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో జరిగిన చర్చకు శనివారం ఆయన సమాధానమిస్తూ.. అన్ని రంగాలు, వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, దీనిపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఊదరగొట్టారు. చాలా తక్కువ సమయంలోనే 32,410 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించామని, మరో 32 వేల ఉద్యోగాల భర్తీ కోసం పోటీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

మత వైషమ్యాలు సృష్టించేవారిని సహించం

రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు రూ.3 వేల కోట్లు కేటాయించారని, హిందువులను విస్మరించారని పేర్కొంటూ మత వైషమ్యాలను రెచ్చగొట్టేలా కొన్ని చానళ్లలో విషప్రచారం చేశారని, అటువంటివారిని సహించేది లేదని భట్టి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను సమానంగా ఆదరిస్తున్నదని, సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.100 కోట్లు, బోనాల పండుగకు రూ.25 కోట్లు కేటాయించిందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలో చిన్నగూడూరు మండలానికి తెలంగాణ బిడ్డ, ప్రముఖ కవి, రచయిత దాశరథి పేరు పెడతామని, శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

శాంతిభద్రతలు గాడితప్పాయి

- కత్తులు దూస్తూ హత్యలు జరుగుతున్నాయి
- రాత్రి 11దాటితే లాఠీచార్జి చేస్తున్నారు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీకు తెలియదా?
- జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగింది?
- ఇందుకేనా కాంగ్రెస్‌ను తెచ్చుకున్నది
- అసెంబ్లీలో కాంగ్రెస్‌పై అక్బరుద్దీన్ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్)పూర్తిగా గాడి తప్పాయని ఎంఐఎం శాసనసభపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలో కత్తులు దూసుకుంటూ హత్యలు జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాత్రి 11గంటల తర్వాత ఇంటి బయట నిల్చొన్న వారినీ పోలీసులు కొడుతున్నారని, ఇదేం జులుం అని ప్రశ్నించారు. ఇందుకేనా కాంగ్రెస్‌ను తెచ్చుకున్నదని మండిపడ్డారు. గతంలో తనపై పెట్టిన కేసును మళ్లీ తిరగదోడారని, సీఎం రేవంత్‌రెడ్డి బడేభాయ్‌కా భాయ్ అమిత్‌షాపై కేసును మాత్రం ఉపసంహరించుకున్నారని విమర్శించారు. శనివారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే అంటుండడంపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటో మీకు తెలియదా అని నిలదీశారు. 'గత పదేళ్లు డిప్యూటీ సీఎం భట్టి, శ్రీధర్‌బాబు సహా చాలా మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు సభలోనే ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో అన్ని లెక్కల్ని సభ ముందు పెట్టింది. దానికి మీరంతా సాక్షులు. అవేవి తెలియనట్టుగా రాష్ట్రం అప్పులపాలైందని ఎలా అంటారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీ అందరికీ తెలుసుకదా. ఇప్పుడు ఈ విమర్శలెందుకు?' అని ప్రశ్నించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 2014లో 4.51 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం 14.63 కోట్లకు పెరిగిందని.. తలసరి ఆదాయం 1.12 లక్షల నుంచి రూ. 3.47 లక్షలకు పెరిగిందని చెప్పారు. కాంగ్రెస్ మంత్రులు చెబుతున్నట్టుగా రాష్ట్ర ఆర్థిక నిర్వహణ బాగాలేకపోతే జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం అభివృద్ధి ఏ విధంగా సాధ్యమైందో చెప్పాలన్నారు. కేంద్రం నుంచి బకాయిలు రావడం లేదంటూనే బడ్జెట్‌లో కేంద్రం నుంచి భారీ నిధులు వస్తాయని చూపడం ఏమిటని ప్రశ్నించారు. బహుశా ఓల్డ్‌సిటీని అదానీకి ఇస్తే.. ఆయన వల్ల ఏమైనా కేంద్రం నుంచి నిధులు వస్తాయేమోనని విమర్శించారు. అన్ని పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి చేసిన ప్రభుత్వం కొత్త కార్డులు మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు.

తప్పుల తడకగా బడ్జెట్

బడ్జెట్ లెక్కలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన స్పీచ్‌లో ఒక లెక్క చెబితే.. బడ్జెట్ కాపీలో మరో లెక్క, సీఏజీ కాపీలో మరో లెక్క.. ఇలా ఒక్కోచోట ఒక్కో రకంగా ఉన్నాయని విమర్శించారు. ఈ తప్పుడు లెక్కలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. బడ్జెట్‌లో తప్పుడు లెక్కలు సభ పరువుకు సంబంధించిన అంశమని ఘాటుగా వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ రేపటికి వాయిదా

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వాయిదా వేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి సభ ప్రారంభంకానున్నట్టు శనివారం ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే విద్యుత్, మున్సిపల్, న్యాయ, అసెంబ్లీ, జీఏడీ, పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, హోం, కార్మిక, ఉపాధి కల్పన, రవాణా, బీసీ సంక్షేమ, విద్య, వైద్య శాఖల పద్దులపై చర్చించనున్నారు.

హైదరాబాద్‌కు కేంద్రం ఏమిచ్చింది ?

రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాం. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కేంద్రబడ్జెట్‌లో హైదరాబాద్‌కు ఎంత తెచ్చారు ? రాష్ట్రానికి నిధులు తేలేని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రులుగా ఉండే అర్హత లేదు. గంగా ప్రక్షాళనకు వేల కోట్లు ఇచ్చి మూసీ అభివృద్ధికి రూపాయి ఎందుకు ఇవ్వలేదు ? కేంద్రాన్ని నిధులు అడగడంలో మాకు ఎలాంటి నామోషీ లేదు. అది మా హక్కు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించాం.

– రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్